# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 05 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## తిరుమలలో చిరుత కలకలం



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

రెండేళ్ల కిందట తిరుమల అలిపిరి మెట్ల మార్గంలో ఆరేళ్ల బాలికను చిరుతపులి చంపేసిన ఘటన తర్వాత కాలి నడకన కొండపైకి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తరచుగా అలిపిరి నడక మార్గంలో చిరుత పులులు దర్శనమిస్తుం డడంతో భక్తులు భయాందోళనలకు గురవుతున్నారు. తాజాగా, మరోసారి మెట్ల మార్గంలో చిరుత కలకలం రేగింది. అర్ధరాత్రి దాటాక ఒంటి గంట సమయంలో గాలి గోపురం వద్ద చిరుత పులి కనిపించింది. అది ఓ పిల్లిని వేటాడి అడవిలోకి తీసుకెళ్లింది. ఈ మేరకు సిసి కెమెరాల్లో రికార్డయింది. సోమవారం రాత్రి తిరుపతిలోని జూ పార్క్ రోడ్డులోనూ చిరుతపులి కనిపించినట్టు తెలిసింది. కాగా, టిటిడి రాత్రి 10 గంటల తర్వాత నడక మార్గాల్లో భక్తులను అనుమతించడం లేదు. అటు, 12 ఏళ్ల లోపు చిన్నారులను మధ్యాహ్నం 2 గంటల లోపే నడక మార్గంలో తీసుకెళ్లేందుకు అనుమతిస్తున్నారు.



### వన్యప్రాణి సంరక్షణ కేంద్రం
## ప్రారంభించిన ప్రధాని మోడీ





**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

2000 జాతులకు పైగా, 1.5 లక్షలకు పైగా అంతరించిపోతున్న జంతువులకు కేంద్రం వంతారా.. గుజరాత్‌లోని జామ్‌నగర్ జిల్లాలో 3,000 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వన్యప్రాణుల సంరక్షణ, పునరావాస కేంద్రం. రిలయన్స్ ఇండస్ట్రీస్ రిఫైనరీ కాంప్లెక్స్ వద్ద కొలువు దీరిన ఈ వన్యప్రాణి సంరక్షణ, పునరావాస కేంద్రంలో వాటి కోసం అన్ని రకాల వసతులు కల్పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కేంద్రాన్ని ప్రారంభించడంతోపాటు లోపల కలియతిరిగారు. ఈ వన్యప్రాణి కేంద్రంలో కల్పించిన వైద్య వసతులన్నీ పరిశీలించారు. పలు జాతుల జంతువులతో మమేకం అయ్యారు. దొంగిలించబడిన వన్యప్రాణులకు అభయారణ్యంగా పునరావాసం కల్పించడంతోపాటు వైద్య వసతులు కూడా కల్పించారు.వంతారాలోని వన్య ప్రాణుల దవాఖానను ప్రధాని నరేంద్రమోదీ సందర్శించారు. వన్య ప్రాణుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఏర్పాటు చేసిన దవాఖానలో వైల్డ్ లైఫ్ అనస్థీసియా, కార్డియాలజీ, నేత్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసన్, ఎంఆర్ఐ, సిటీ స్కాన్, ఐసీయూ తదితర జంతు వైద్య వసతులను పరిశీలించారు. ఎంఆర్ఐ స్కానింగ్ రూమ్‌లో ఆసియా సింహానికి ఎంఆర్ఐ స్కానింగ్ చేస్తున్న తీరును ఆసక్తిగా గమనించారు.జాతీయ రహదారిపై గాయపడిన ఓ చిరుత పులిని సంరక్షించి వంతారా వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి తరలించారు. గాయపడిన చిరుతపులికి ఆపరేషన్ థియేటర్‌లో చేస్తున్న శస్త్ర చికిత్సను పరిశీలించారు.

ఆసియా ఖండ ప్రాంత సింహాలు, చిరుత పిల్లలు, అరుదైన జాతుల పిల్లలతో ప్రధాని మోదీ కొద్దిసేపు సరదాగా ఆడుకున్నారు. ఇటీవలే సంరక్షించి వంతారా వన్యప్రాణి కేంద్రానికి తరలించిన ఆడ సింహం జన్మనిచ్చిన సింహం పిల్లలు, పొడవైన కాళ్ల అడవి పిల్లులతో ఆయన ఆడుకున్నారు.ఒకప్పుడు భారతీయ అడవుల్లో సమృద్ధిగా కనిపించే పొడవు కాళ్ల అడవి పిల్లి ప్రస్తుతం అరుదైన జాతిగా మారింది. వంతారా వన్య ప్రాణి సంరక్షణ, పునరావాస కేంద్రంలో పొడవైన అడవి పిల్లుల సంతానోత్పత్తి కార్యక్రమాన్ని చేపట్టారు. అవి పుట్టి పెరిగిన తర్వాత దేశంలోని ఇతర వన్య ప్రాణులు, అభయారణ్యాల్లో విడుదల చేస్తున్నారు.ఆసియా సింహాలు, మంచు చిరుతపులులు, ఒంటి కొమ్ము

గల ఖడ్గమృగాల వంటి పలు క్రూర మృగాలతో ప్రధాని నరేంద్రమోదీ అతి సన్నిహితంగా తిరుగాడారు. గోల్డెన్ టైగర్, నాలుగు మంచు పులులు, చింపాంజీలు, జీబ్రాలు, జిరాఫీలు, ఖడ్గమృగం దూడల మధ్య నుంచి అడుగులేస్తూ నీటి కొలనుల్లో గల మొసళ్లు, నీటి గుర్రాలకు అత్యంత సన్నిహితంగా మెదిలారు. సమీప గ్రామాల ప్రజలు సంరక్షించి వంతారా క్షేత్రానికి తరలించిన పెద్ద కొండ చిలువ, రెండు తలల పాము, రెండు తలల తాబేలు తదితర జంతువులనూ ప్రధాని మోదీ తిలకించారు.

కీళ్ల వాపులు, కాళ్ల సమస్యలతో మిగితా 2వ పేజీలో

## ధాన్యం బకాయిలు
## రూ. 1,468.94 కోట్లను విడుదల చేయాలి

- మిల్లింగ్ గడువు పెంచండి
- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ వినతి

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయ్యారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. 2014-15 సంవత్సరానికి సంబంధించి సేకరించిన ధాన్యం బకాయిలు రూ. 1,468.94 కోట్లను విడుదల చేయాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గారికి వినతి పత్రం అందజేశారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన రూ. 343.27 కోట్ల బకాయిలను విడుదల చేయాలని, కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీ గడువును పొడిగించాలని కోరారు.

తెలంగాణ రాష్ట్రానికి పీఎం కుసుమ్ పథకం కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులను పునరుద్ధరించాలని కేంద్ర ఆహార పౌర సరఫరాలు, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి గారికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు గతంలో 4 వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం, తర్వాత దానిని వెయ్యి మెగావాట్లకు కుదించిన విషయాన్ని కేంద్ర మంత్రి గారి దృష్టికి తెచ్చారు. తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సోలాల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు కేంద్ర మంత్రి గారికి వివరించి, గతంలో మంజూరు చేసిన 4 వేల మెగావాట్ల ఉత్పత్తి అనుమతులను పునరుద్ధరించాలని కోరారు.

ముఖ్యమంత్రి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారితో కలిసి ఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి గారిని కలిసి రాష్ట్రానికి సంబంధించి పెండింగ్ అంశాలను వివరించారు. భారత ఆహార సంస్థకు 2014-15 ఖరీఫ్ కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పెట్టిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. అప్పట్లో అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని, వాటిని వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద మే 2021 నుంచి మార్చి 2022 వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకుని అందుకు సంబంధించిన బకాయిలు విడుదల చేయాలని చెప్పారు. జూన్ 2021 నుంచి ఏప్రిల్ 2022 వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఏ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ విషయాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

## మహిళలకు సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

- ప్రతి నెల ఒక్కో బస్సుకు రూ.77,220 అద్దె చెల్లింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 50 బస్సులను ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సుల అద్దెకు తీసుకోవాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా బలపరచాలని నిర్ణయించింది. మహిళా సంఘాలచే కొనుగోలు చేసిన బస్సులకు టీజీఎస్ఆర్టీసీ ప్రతి నెలా అద్దె చెల్లిస్తుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8వ తేదీన పరేడ్ గ్రౌండ్ వేదికగా 50 బస్సులను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లు ప్రారంభించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసింది.మహిళా సంఘాల ద్వారా మొత్తం 600ల బస్సులను కొనుగోలు చేయనున్నారు. ఈ బస్సులకు ప్రతినెలా టీజీఎస్ఆర్టీసీ అద్దె చెల్లిస్తుంది. విడతల వారీగా మహిళా సంఘాల వద్ద బస్సులను ఆర్టీసీ అద్దెకు తీసుకోనుంది. మొదటి విడతలో 150 మండల సమాఖ్యల నుంచి 150 అద్దె బస్సులను ఆర్టీసీ తీసుకోనుంది. ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యల వద్ద 450 బస్సులను విడతల వారీగా ఆర్టీసీ అద్దెకు తీసుకోనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేసిన అద్దె బస్సులకు ప్రతి నెల ఒక్కో బస్సుకు టీజీఎస్ఆర్టీసీ రూ.77,220 అద్దె చెల్లించనుంది. బస్సుల కొనుగోలు కోసం మహిళా సంఘాలకు ప్రభుత్వం బ్యాంకు గ్యారంటీ ఇవ్వనుంది. దీంతో దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులు నడవనున్నాయని ఆర్టీసీ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## రేపు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

- చర్చకు రానున్న బిసి రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు..!
- 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు లబ్ధి చేకూరేలా మరిన్ని కొత్త పథకాలు..!

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 6వ తేదీన జరుగనుంది. సచివాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది. బిసి రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. రెండో దశ సమగ్ర కులగణనకు మంత్రిమండలి ఆమోదించనున్నట్టుగా సమాచారం. బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. జస్టిస్ షమీమ్ అఖ్తర్ కమి షన్ సిఫార్సుల్లో మూడింటిని ఇప్పటికే ఆమోదించిన కేబినెట్ ఆ తర్వాత వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి చర్చించనుంది. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కోసం బిల్లుపై చర్చించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది.

బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు జరపాలి, బడ్జెట్ సమావేశాల్లో ఏయే బిల్లులు ప్రవేశపెట్టాలా అన్న విషయంపై ఈ కేబినెట్‌లో స్పష్టత రానుంది. వీటితో పాటు ఇటీవల ముఖ్యమంత్రి ఢిల్లీలో ప్రధానితో సమావేశం, ఎపితో ఉన్న నీటి వివాదంపై అనుసరించాల్సిన వ్యూహం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. అదే విధంగా ఈనెల 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు లబ్ధి చేకూరేలా మరిన్ని కొత్త పథకాలు తీసుకు రానున్నట్టు గా తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆయా పథకాలపై కూడా ఈ భేటీలో చర్చించనున్నట్టుగా సమాచారం.



## బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి ముందంజ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కరీంనగర్ మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌లో కడపటి వార్తలుంచే సరికి బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి ముందంజలో ఉన్నారు. గతనెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ జరిగింది ఈ పోలింగ్ కు సంబంధించి సోమవారం ఓట్ల లెక్కింపు ఉదయం ప్రారంభమైంది. ఇందులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కుసంబంధించి చెల్లని ఓట్లు, చెల్లుబాబు ఓట్లుగా వేరుచేసి గణించారు. ఈ గణన సోమవారం రాత్రి 9 గంటల వరకు జరగగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విజేత ఫలితాలు వెలువడి బిజెపి అభ్యర్థి మల్కా కొమురయ్య ఘన విజయం సాధించారు. కాగా సమయభావంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు నిలిచింది. మళ్లీ మంగళవారం ఉదయం ప్రారంభమైంది. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 3.55,159 పట్టభద్రుల ఓటుండగా పోస్టల్ బ్యాలెట్ లతో సహా 2.52,100 ఓట్లు పోలయ్యాయి. వీటిలో సుమారు 28 వేల ఓట్లను చెల్లని ఓట్లుగా అధికారులు పరిగణించారు. సోమవారం ఎన్నికల పరిశీలకులు బుద్ధ ప్రకాష్యోతి సమక్షంలో స్ట్రాంగ్ రూములను తెరిచి బ్యాలెట్ పెట్టెలను తెరిచారు. మొత్తం 49 బ్యాలెట్ లలో నిక్షిప్తమైన ఓట్లను 21 టేబుల్ లలో చెల్లని, చెల్లుబాటు ఓట్లుగా సాయంత్రం గం.4:00 వరకు విభజం. వారు. ఇందులో 2 లక్షల 24 వేల ఓట్లు చెల్లుబాటు కాగా, ఇరవై ఎనిమిది వేల ఓట్లు చెల్లని ఓట్లుగా ఎన్నికల అధికా రులు నిర్ధారించారు. అనంతరం ఒక్కో టేబుల్ కి కి 21 వేల ఓట్ల చొప్పున 11 రౌండ్లలో రెక్కింపు ప్రారంభించారు. మొదటి రౌండ్ లెక్కింపు మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమైంది. 6వ రౌండ్ల వరకు బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి కి 38,967 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కి 31,644 బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరి కృష్ణకు 26,562 లో మూడో స్థానంలో నిలిచారు. అయితే వీటిలో బీజేపీ రౌండ్ రౌండ్ కిఓట్లు పెరగగా కాంగ్రెస్, బీఎస్సీ లకు తగ్గాయి. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు లోపలితం తేలే అవకాశం లేదు. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తప్పనిసరి కానుంది..

## ప్రభుత్వ భూముల అమ్మకానికి సర్కారు కుట్ర

- నాడు సుద్దులు... నేడు టెండర్లు
- ప్లేటు ఫిరాయించిన సీఎం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రతీ అంశం లో ప్లేటు ఫిరాయిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ భూముల అమ్మకంపై కూడా తన నాలుకను మడత పెట్టి నిస్సిగ్గుగా నిధుల సమీకరణ కోసం వేలాల బాట పట్టిండు అని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. భూముల వేలంపై మారిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని చూసి ఊసరవెల్లి సైతం ఉరి వేసుకునే పరిస్థితి నెలకొన్నది అని విమర్శించారు."ప్రభుత్వ భూములంటే పెద్దలిచ్చిన ఆస్తి అని, తెలంగాణ జాతి సంపద అని, ఆ భూములను అమ్మితే భవిష్యత్తులో స్మశానాలు నిర్మించాలంటే కూడా భూమి లేకుండా పోతుందని" నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి మొసలి కన్నీరు కార్చిండు. తాము అధికారంలోకి వస్తే ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము అంటూ ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి ఇపుడు వేల కోట్ల విలువైన భూములను అగ్రాస్ వేసేందుకు తెరలేపిండు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.ప్రభుత్వ భూములను అమ్మబోమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించి మూడు నెలలైనా గడవక ముందే విలువైన ఆస్తులను కొల్లగొట్టేందుకు కుట్ర పన్నారు. పవిత్ర అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాటలను నీటి మూటలు చేస్తూ, నిధుల సమీకరణ పేరుతో ఇప్పుడు నిస్సిగ్గుగా భూములను అడ్డికి పావుశేరుకు అమ్ముతుండటం కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు అద్దం పడుతున్నది. మాస్టర్ ప్లాన్ పేరిట వేలం పాట నిర్వహించేందుకు కన్సల్టెంట్ నియమకానికి (ఆర్ఎఫ్‌పీ) గత నెల 28న టెండర్లు పిలవడం దిగజారుడు తనానికి పరాకాష్ట అని హరీశ్‌రావు మండిపడ్డారు.


కంచ గచ్చిబౌలి గ్రామం సర్వే నంబర్ 25 పరిధిలోని 400 ఎకరాలను బ్యాంకర్లకు తనఖా పెట్టిన సమయంలో ప్రభుత్వం 25 కోట్లకు ఎకరం చొప్పున రూ.10వేల కోట్లు ఇప్పటికే సమీకరించింది. ఇప్పుడు ఇదే భూమిని వేలం వేసి దాదాపు రూ.30వేల కోట్లను సమీకరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఒకవైపు బ్యాంకులో తనఖా పెట్టడం, మరోవైపు తనఖా పెట్టిన అవే భూములను వేలం వేసి అమ్ముకోవడం ప్రభుత్వ దివాలాకోరు తనానికి నిదర్శనం. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కపట బుద్ధిని ఆధారాలతో సహా బయటపెట్టాను అని హరీశ్‌రావు గుర్తు చేశారు.



జూన్ 26, 2024 నాడు విడుదల చేసిన జీవో ఎంఎస్ 54తో ఎకరానికి 75 కోట్ల చొప్పున మొత్తం 30వేల కోట్ల విలువైన భూములను అమ్ముతున్నారని నేను అసెంబ్లీలో నిలదీస్తే.. అలాంటిదేమి లేదని, టీజీఐఐసీకి చేస్తున్న భూ బదలాయింపు మాత్రమేనని బుకాయించారు. నిండు సభలో ముఖ్యమంత్రి సహా మంత్రులు తప్పుడు సమాధానం చెప్పి, సభను, సభ్యులను తప్పుదోవ పట్టించారు. అసెంబ్లీ అయ్యిందో, లేదో వెంటనే అదే భూమిని తనఖా పెట్టి రూ. 10వేల కోట్ల రుణం తెచ్చుకున్నరు. మల్లా అసెంబ్లీ మొదలయ్యే లోపే ఇప్పుడు అదే భూమిని అమ్మకానికి టెండర్లు పిలుస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు.అధికారంలోకి రాగానే దివ్యమైన రాష్ట్రాన్ని దివాలా దివాలా అని దిగజారుడు రాజకీయాలు చేశారు. బ్రహ్మాండంగా ఉన్న రాష్ట్ర పరపతిని, ప్రతిష్టను బజారు కీడ్చారు. మూసీ మిగితా 2వ పేజీలో

## ఉగాది నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ

- ప్రకటించిన ప్రభుత్వం
- కార్డు రంగుతోపాటు మారనున్న రూపు రేఖలు
- కొత్త రేషన్ కార్డు నమూనాను ఫైనల్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఉగాది నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ క్రమంలో కొత్త రేషన్ కార్డు నమూనాను సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ఫైనల్ చేశారు. లేత నీలి రంగులో ఈ కొత్త రేషన్ కార్డును తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. అలాగే రేషన్ కార్డుపై సీఎం రేవంత్ రెడ్డితోపాటు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ఉండే విధంగా రేషన్ కార్డు నమూనాని ఖారారు చేశారు. ఇక రేషన్ కార్డుపై ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ఇప్పటికే రేషన్ కార్డులు ఉన్న వారికి కూడా కొత్త కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 80 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వారందరికీ కూడా కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సీఎం రేవంత్ ప్రభుత్వం ఆదేశించారు. మార్చి 30వ తేదీ తెలుగు సంవత్సరాది.. ఉగాది. ఆ రోజున కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ఉండాలనే ఓ స్పష్టమైన లక్ష్యంతో రేవంత్ సర్కార్ వడి వడిగా అడుగులు వేస్తోంది.

## బీజేపీ అంటే నమ్మకం కాదు అమ్మకం

- సీసీఐను అమ్మడం దుర్మార్గం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**


కేటీఆర్ బీజేపీ అంటే నమ్మకం కాదు అమ్మకమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ని తుక్కు కింద తెగనమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీసీఐని పునఃప్రారంభిస్తామని మాటిచ్చి, ఓట్లు, సీట్లు దండుకుని చివరికి స్క్రాప్ కింద అమ్మేస్తారా అంటూ నిలదీశారు. సీసీఐపైనే కోటి ఆశలు పెట్టుకుని ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసనలు కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా? వారి ఆర్తనాదాలు వినిపించడం లేదా మండిపడ్డారు.ఎంతో విలువైన యంత్ర పరికరాలను పాత ఇనుప సామాన్ల కింద లెక్కకట్టి ఆన్‌లైన్‌లో టెండర్లు



పిలవడం, సీసీఐ సంస్థ గొంతు కోయడమేనన్నారు. నిర్మాణ రంగంలో సిమెంటుకున్న డిమాండ్ దృష్ట్యా సీసీఐని ప్రారంభించి కార్మికులను కాపాడాలని బీఆర్ఎస్ పదుల సార్లు కేంద్రమంత్రులకు మిగితా 2వ పేజీలో

## మార్చి 22లోగా సమాధానం ఇవ్వాలి

- సుప్రీంకోర్టు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పార్టీ ఫిరాయించి కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ అసెంబ్లీ సెక్రటరీ, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. మార్చి 22లోగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 25కి వాయిదా వేసింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ ధర్మాసనం ఈ పిటిషన్ ను విచారించింది.

విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్య విధానాలకు సరైన సమయం అవసరమని వ్యాఖ్యానించారు. మీరు నిర్ణయం తీసుకోవడానికి ఎంత సమయం కావాలో చెప్పాలని అన్నారు. రీజనబుల్ టైమ్ అంటే ప్రస్తుత అసెంబ్లీ కాల పరిమితి ముగిసేంతవరకా? అని ప్రశ్నించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ అసెంబ్లీ సెక్రటరీ, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. మార్చి 22లోగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 25కి వాయిదా వేసింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ ధర్మాసనం ఈ పిటిషన్ ను విచారించింది.

# ఎకరాకు రూ. 5 కోట్లు పరిహారం ఇస్తేనే భూములిస్తాం

- అధికారులను అడ్డుకున్న మామునూరు భూనిర్వాసితులు
- 3 ప్రధాన రహదారిపై బైఠాయింపు

**బలగం టీవి, వరంగల్**

తమకు మార్కెట్ ధరకి తగినట్టుగా ఎకరాకు రూ. 5 కోట్లు పరిహారం ఇస్తేనే భూములు ఇస్తామని మామునూరు భూనిర్వాసితులు స్పష్టం చేశారు. అలాగే తమ గ్రామాలకు ప్ర త్యామ్నాయ రోడ్డు మార్గాలు చూపిస్తేనే సర్వేకు అనుమతి ఇస్తామని వారు తెగుసి చెప్పారు. వరంగల్ జిల్లా మామునూరు ఎయిర్పోర్ట్ వద్ద భూ నిర్వాసితులు మంగళవారం ఆందోళనను ఆందోళన దిగారు. నక్కలపల్లి, గుంటురుపల్లి, నల్లకుంట, గాడిపెల్లి గ్రామాల్లో ఆర్డీఓ సత్యపాల్రెడ్డి ఎమ్మార్వో నాగేశ్వరరావులతో పాటు రెవెన్యూ సర్వే బృందం ఆయా గ్రామాల పరిధిలోని ఎయిర్ పోర్ట్ స్థలసేకరణ సర్వేచేసేందుకు చేరు కున్నారు. శాంతిభద్రతలో భాగంగా పోలీసులు కూడా అక్కడకు చేరుకున్నారు. సర్వే విషయం తెలుసుకున్న దాదాపు 200 మంది గ్రామస్తు లు, రైతులు, ప్రధాన రహదారిపై బైఠాయించి జై జవాన్.. జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు బాధితుల వద్దకు చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా విని పించుకోలేదు రైతులు స్థానిక ప్రజలు రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగి సర్వేకు రైతులు సహకరించక పోవరంలో రెవెన్యూ అధికారులు తిరిగి వెళ్లిపోయారు పూర్తి విషయాన్ని ఉన్నతాధికారులు తెలియక్తి స్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.





# వటపత్ర శాయిగా నరసింహుడు

**బలగం టీవి, యాదగిరిగుట్ట**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 1 నుంచి ప్రారంభమైనయా వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగ ళవారం స్వామివారు వటపత్ర శాయిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఈ సందర్భం గా ఆలయ మాడవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఉదయం ఆలయంలో నిత్య ఆరాధనల అనంతరం ఉదయం 10 గంటలకు స్వామివారిని అలంకరిం చిభక్తకోటికి దర్శనం కల్పించారు. రాత్రి హంస వాహన సేవలో లక్ష్మీ నరసింహ స్వామి మహాద్భుత దర్శనభాగ్యం భక్తులకు కలిగింది. కాగా బుధవారం ఉదయం స్వామివారిని గోవర్ధ నగిరిధారిగా సాయంత్రం సింహ వాహన సేవలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

# బీజేపీ అంటే నమ్మకం కాదు అమ్మకం

- సీసీఐను అమ్మడం దుర్మార్గం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

మొరపెట్టుకున్నా కనికరించక పోవడం ఆదిలాబాద్కు వెన్నుపోటు పొడవడమేనని చెప్పారు. 772 ఎకరాల భూమి, 170 ఎకరాల్లో టౌన్ షిప్, 48 మిలియన్ లైమ్ స్టోన్ నిల్వలతో సకల వనరులున్న సంస్థను అంగడి సరుకుగా మార్చేసిన కేంద్రానికి ఉద్యోగులు, కార్మికుల గోస తగలక మానదన్నారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునే దాకా కార్మికులతో కలిసి ఉద్యమిస్తాం.. సంస్థ పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాడతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## వన్యప్రాణి సంరక్షణ కేంద్రం

# ప్రారంభించిన ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బంది పడుతున్న ఏనుగుల నడకలో మెరుగుదలకు హైడ్రో థెరపీ పూల్స్ కూడా వంతారా కేంద్రంలో నిర్మించారు. ప్రపంచంలోకెల్లా అతిపెద్దదైన ఏనుగుల దవాఖానలో జరుగుతున్న చికిత్స, తదితర విషయాలను ప్రధాని మోదీ గమనించారు. ఈ కేంద్రంలో సంరక్షిస్తున్న చిలుకలను ప్రధాని మోదీ విడుదల చేశారు. ఈ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, సపోర్టింగ్ స్టాఫ్, సిబ్బందితో ప్రధాని మోదీ ఇష్టాగోష్టిగా సంభాషించారు.

# మినీ అంగన్వాడీల పెండింగ్ జీతాలు చెల్లించాలి

**బలగం టీవి, హైదరాబాద్**

మినీ అంగన్వాడీల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది అంగన్వాడీలు మంగళవారం హైదరాబాద్లోని ప్రజాభవన్కు తరలివ చ్చారు. సీఐటీయూ అను బంధ సంఘమైన తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి ర్యాలీగా తరలివచ్చారు. మెట్రో దాటిన తర్వాత వారిని పోలీసులు మధ్యలో అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాంతో పోలీసులకు, అంగన్వాడీలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ప్రజావాణికి వెళ్ళనీయకుండా అడ్డుకుంటే రోడ్డుపై బైఠాయిస్తామని తెగేసి చెప్పడంతో పోలీసులు అనుమతిచ్చారు. ఐసీడీఎస్ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలనీ, మొబైల్ సెంటర్లను ఎత్తేయాలనీ, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయొద్దని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలనీ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, టీచర్లు, హెల్పర్లను రెగ్యులర్ చేయాలనీ, కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీల ప్రకారం రూ.18వేల వేతనం పెంచడంతో పాటు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్లకార్డులు, జెండాలు పట్టుకుని నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఈ సందర్భంగా వారు ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్కు అందజేశారు.

ఇన్చార్జీ చిన్నారెడ్డితో పాటు పలువురు అధికారులు మూడు దఫాలుగా అంగన్వా డీలతో ప్రజాభవన్లో చర్చలు జరిపారు. అనం తరం అధికారులు వారికి నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు. మినీ అంగన్వాడీ టీచర్లకు 10నెలల పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల తంతు అయిపోయిన వెంటనే జీవోను జారీ చేస్తామనీ, వారికి హెల్పర్లను నియమించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అంత ర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ప్రభుత్వం ప్రకటించే అవ కాశముందని వారికి అధికారులు వివరించారు. పదవీ విరమణ పొందిన వారికి షరతులు లేకుండా ఆసరా పెన్షన్ వచ్చేలా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తామనీ, ఉద్యోగంలో కొనసాగుతున్న వారికి ఆసరా పెన్షన్ ఇవ్వడం కోసం ఉన్న అవ కాశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. ఇతర డిమాండ్లను ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్య క్రమంలో అంగన్వాడీ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, కోశాధికారి పి. మంగ, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు సమ్మక్క, కోటేశ్వరి, రాష్ట్ర నాయకులు వెంకటమ్మ, ఏసు, మణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల అమ్మకానికి సర్కారు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

సుందరీకరణ, హైడ్రా అంటూ లేనిపోని భయాందోళనలు సృష్టించి హైదరాబాద్ బ్రాండ్ను దెబ్బతీశారు. మొత్తంగా బీఆర్ఎస్ పాలనలో అద్భుతమైన ప్రగతి సాధించిన తెలంగాణను మీ 14నెలల పాలనలో తిరోగమనం బాట పట్టించారు. తలాతోకలేని విధానాలు, నిర్ణయాల వల్ల రాష్ట్ర రాబడి తగ్గడం వల్ల చివరకు ప్రభుత్వ భూములను అమ్ముకొని ఆదాయం సమకూర్చుకునే స్థాయికి దిగజారారు. ఆ భూములను అమ్ముకోవాలన్నా మీకు, మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి కేసీఆర్ పదేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధిని ప్రచారం చేసుకోకతప్పడం లేదని హరీశ్రావు పేర్కొన్నారు.

ఒకవైపు తెలంగాణ దివాలా తీసిందంటూనే, మరోవైపు మీరు రూపొందించిన రిక్వెస్ట్ ఫర్ ప్రపోసల్ (ఆర్ఎఫ్పీ)లో ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధిలో తెలంగాణ రోల్ మోడల్ అయ్యిందని, ఇండస్ట్రియల్ పాలసీ దేశానికే తలమానికం అని పేర్కొన్నారు. 2011-12 లో 3.6లక్షల కోట్లుగా ఉన్న జీఎస్డీపీ, 2020-21 నాటికి 11.5 కోట్లకు చేరిందని, దేశంలోనే అత్యధిక ఎకనమిక్ గ్రోత్ నమోదు చేసిందని స్పష్టంగా తెలిపారు. భూములు అమ్ముకోవడానికి డాక్యుమెంట్ల రూపంలో చెబుతున్న తెలంగాణ అభివృద్ధి గణాంకాలను, బహిరంగంగా ఎందుకు ఒప్పుకోవడం లేదు రేవంత్ రెడ్డి గారూ అని హరీశ్రావు ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి మీరు ఎంత ప్రయత్నం చేసి దాచినా దాగదు. అసత్యాలు ప్రచారం చేయడం, ప్రతిపక్షాలను బుకాయించడం వంటివి ఇకనైనా మానుకోవాలని హితవు పలుకుతున్నా. భూములు అమ్మబోమని ప్రజలను, అసెంబ్లీని సైతం తప్పుదోవ పట్టించినందుకు యావత్ తెలంగాణకు క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్నిడిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వ భూములు అమ్మితే స్మశానానికి కూడా జాగ ఉండదన్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు స్మశానాలకు భూములు ఎక్కడ పుట్టిస్తారో చెప్పాలని హరీశ్రావు డిమాండ్ చేశారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

**ఒక నిమిషం నిబంధన ఎత్తివేత**

**5 నిమిషాలు ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతి**

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో నేటి నుంచి ఇంటర్ పరీక్షలు మొదలు కానున్నా యి. అయితే, ఈసారి నుంచి ఇంటర్మీడియ ట్ వార్షిక పరీక్షలకు ఈసారి ఒక్క నిమిషం ఆలస్యం నిబంధన వర్తించదు. పరీక్ష ప్రారంభమైన తర్వాత 5 నిమిషాలు.. అంటే ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులనుకేంద్రంలో కి అనుమతించనున్నారు. రాష్ట్రంలో మార్చి5 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వారిక పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 6వ తేదీ నుంచి మొదలవనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో పరీక్షల సమయంలో విద్యార్థుల కు ఇంటర్ బోర్డు కీలక సూచనలు చేసింది. ఇంటర్ పరీక్షల్లో ఒక్క నిమిషం నిబంధనను సడలించారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమైతే. ఉదయం 9.05 గంటల వరకు మాత్రమే విద్యార్థులను అనుమతిం చనున్నారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్య చర్చి కృష్ణ ఆదిత్య సూచించారు. విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుంటే ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్ష రాసుకో వచ్చన్నారు తల్లిదండ్రులు కూడా విద్యార్థులు ముందుగా చేరుకునేలా చర్యలు తీసుకోవా అని ఆయన కోరారు. నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్యలో ఓఎంఆర్ పత్రాన్ని విద్యార్థులు పూర్తి చేయాలని, ఎవరికి వారు తమకిచ్చిన పత్రంపై తమ వివరాలే ఉన్నాయా? లేదా? అనినరిచూ సుకోవాలన్నారు.

**పరీక్షలకు హాజరుకానున్న 9.96 లక్షల**

ఈసారి ఇంటర్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,96,971 విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో ఫస్టియర్ 4,88,448 మంది, సెకండియర్ 5.08.523 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికోసం రాష్ట్రవ్యాప్తం గా 1,532 ఎగ్జామ్ సెంటర్లను ఇంటర్ బోర్డు ఏర్పాటుచేసింది. ఇందులో 49 సెల్ఫ్ సెంటరు ఉన్నాయి.

# గాంధీ ఆస్పత్రిలో మంత్రి తనిఖీ

**బలగం టీవి, హైదరాబాద్**

గాంధీ ఆస్పత్రిలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ముందస్తు సమాచారం లేకుండా డ్యూటీకి గైర్హాజరైన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. నేరుగా ఔటు పేషెంట్ వార్డుకు వెళ్లి రోగులతో మాట్లాడారు. డాక్టర్ల అటెండెన్స్ షీట్ తెప్పించుకుని పరిశీలించారు. ఓపీలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. డుమ్మా డాక్టర్లకు షోకాజ్ నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని డీఎంఈ, హాస్పిటల్ సూపరింటెండెంట్ను ఆదేశించారు. గాంధీలో ఓపీ, ఐపీ, ఎంసీహెచ్, ఐవీఎఫ్, ఓపీ డయాగ్నస్టిక్ సర్వీసెస్, స్కానింగ్ వార్డులను మంత్రి పరిశీలించారు. ఐవీఎఫ్ సేవల్లో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత డాక్టర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీఎంఈని ఆదేశించారు. విధులకు గైర్హాజరైన డాక్టర్లపై చర్యలుంటాయనీ, డాక్టర్లు, ప్రొఫెసర్లు, ఆర్ఎంఓలు డుమ్మా కొడితే ఉపేక్షించేది లేదనీ హెచ్చరించారు. గాంధీలో వైద్య సేవలపై త్వరలో సీరియస్ రివ్యూ చేస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఎక్కడా రోగులకు ఇబ్బందులు కలుగొద్దన్నారు. వైద్యులు సకాలంలో డ్యూటీకి రావాల్సిందేనన్నారు. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూస్తామని, అన్ని ఆస్పత్రులపై నిరంతరం నిఘా పెట్టామని చెప్పారు. మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు.

# కేటీఆర్ ఎఫెక్ట్.. సిరిసిల్ల రైతులకు నీళ్లు..,



**బలగంటీవీ, సిరిసిల్ల**

ఎండిపోతున్న రైతన్నల పంట పొలాలను కాపాడడం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నీళ్లను విడుదల చేయాలని లేకుంటే సాగునీటి శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తానని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పంటపొలాలకు నీటిని విడుదల చేసే విషయంలో ముందుకు కదిలినట్టు తెలుస్తోంది. ఆదివారం సిరిసిల్ల నియోజకవర్గంలో ఎండిపోతున్న పంట పొలాలను పరిశీలించిన అనంతరం కేటీఆర్, మల్కపేట రిజర్వాయర్ పరిధిలో నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి 48 గంటల గడువు విధించిన ఆ కేటీఆర్ హెచ్చరిక నేపథ్యంలో ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిరిసిల్ల జిల్లా కలెక్టర్ విడుదల అంశంలో చర్యలు ప్రారంభించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయని మల్కపేట మరియు రంగనాయక సాగర్ నుండి నీరు వదలాలని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీతో ఫోన్లో మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,. 48 గంటల్లో నీళ్ళు విడుదల చేయకపోతే ధర్నా చేస్తానని కేటీఆర్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ సాగునీటి శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మల్కపేట రిజర్వాయర్, పంప్ హౌస్, కంట్రోల్ రూం ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. మిడ్ మానేర్ నుంచి మల్కపేట రిజర్వాయర్ లోకి నీటి విడుదలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.ఫోన్‌లో మాట్లాడిన 48 గంటల లోపే మిడ్ మానేర్ నుంచి మల్కపేట రిజర్వాయర్ లోకి నీటి ని ప్రభుత్వం విడుదల చేసింది. బోయినపల్లి మండలంలోని మిడ్ మానేర్ నుంచి 0.5 టీఎంసీ నీటి విడుదల తర్వాత, ఈ నీరు మల్కపేట రిజర్వాయర్‌కు చేరుకున్న వెంటనే, దీని పరిధిలోని ఎల్లారెడ్డిపేట మండలంలోని మైసమ్మ చెరువు, సింగసముద్రం చెరువులకు చేరనున్నాయి.



# నేరం చేస్తే శిక్ష తప్పదు..

**- ఎస్పీ అఖిల్ మహాజన్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

నిందితులకు శిక్షపడుటలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లది కీలకపాత్రని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు కేసులకు సంబంధించిన కేసుల్లో నిందితులకు శిక్షల పడేలా కృషి చేసిన పీపీ లను ,కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినదించి ప్రశంస పత్రాలు,ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీసు అధికారులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సమన్వయంతో నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేవిధంగా కృషి చేయాలని, ప్రధాన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసి శిక్షల శాతం పెరిగేలా పని చేయటం అభినదనియని అన్నారు.పోలీస్ ఆదికారులు న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేవిధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని అన్నారు . పోక్సో,హత్య కేసులను ప్రధానమైనవిగా భావించి ముందుకు సాగాలనిఅన్నారు . ప్రస్తుత రోజుల్లో సాంకేతికత కీలకంగా మారిందని అన్ని కేసుల్లో సైంటిఫిక్ ఆధారాలు కచ్చితంగా జమ చేయాలన్నారు.గడిచిన రెండు నెలల్లో 22 కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు కోర్ట్ ద్వారా విదించడం జరిగిందని అన్నారు . వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ ‌ప సంబంధించిన గంజాయి కేసులో నిందుతులకు 05 సంవత్సరాలు జైలు శిక్ష కోర్టు ద్వారా విధించడం జరిగిందని అన్నారు . ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఎంఎస్ ఎస్.ఐ లు శ్రవణ్ యాదవ్, రవీంద్రనాయుడు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# మిడ్ మానేరు నుంచి మల్కాపేట రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయాలి




**- ఎన్నికల్లో ఇచ్చిన వెంటనే అమలు చేయాలి**

**- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**

**బలగం టీవీ, సిరిసిల్ల**

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, రైతులకు పూర్తిస్థాయిలో రైతు భరోసా, రుణ మాఫీ అమలు చేయలేదని, ఒక్క హామీ అమలు చేయకుండా కాంగ్రెస్ నాయకులు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు.మంగళవారం సిరిసిల్ల పట్టణ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ ఎండిఫోతున్న పంటలకు సాగునీరు వదలడానికి కెటిఆర్ కృషి చేశారని అన్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో పంటలు ఎండిపోయాయని,ఎండిపోయిన పంటల రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని,మిడ్ మానేరు నుండి మల్కపేట రిజర్వాయర్ కి 0.5 టీఎంసీ కాకుండా 1.5 టీఎంసీ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రాజెక్ట్ లన్ని పూర్తి చేసుకున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చివరి ఆయకట్టువరకు సాగునీటిని అందించినమని అన్నారు.స్థానిక కాంగ్రెస్ నాయకుడు కే కే ఆచితూచి మాట్లాడాలని, రేవంత్ ఎంగిలి బిస్కెట్ లకు ఆశపడి కే కే ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నడని అన్నారు.కాంగ్రెస్ నాయకులు మాట్లాడే మాటలను ప్రజలు గమనిస్తున్నారని,స్థానిక సంస్థల, మున్సిపల్ ఎన్నికలలో ప్రజలు అధికార పార్టీకి కర్రు కాసి వాత పెట్టనున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరచడానికి కృషి చేయాలని అన్నారు.

# బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పి కొట్టాలి



**బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య**

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పి కొట్టాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మంగళవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్నపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు గోగురి చంద్రారెడ్డి తో రైతుగా చిత్రీకరించి తప్పుడు మాటలు మాట్లాడించారని అన్నారు.కేకే మహేందర్ రెడ్డి రైతుల పట్ల ఎన్నడు అమర్యాదగా మాట్లాడలేదని తెలిపారు. అంతేకాకుండా రాజన్నపేట అల్మాస్పూర్ బాకురుపల్లి దేవుని గుట్ట తండా రాచర్ల గొల్లపల్లి గ్రామాలకు సంబంధించిన పంట పొలాలు ఎండిపోకుండా సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రంగా ప్రయత్నించారని దీని మూలంగానే మంగళవారం మల్కపేట రిజర్వాయర్ ద్వారా నీటి విడుదలకు మార్గము సుగమయింది అన్నారు.దుమాల గ్రామానికి చెందిన మల్లెల బాబు చదువుకున్న వ్యక్తి అని అతడు హైదరాబాదులో నారాయణ శ్రీ చైతన్య కళాశాలలో ఉపన్యాసకుడుగా పని చేశాడని అన్నారు మంచి జీతం ప్రమోషన్ కోసం దుబాయ్ కి వెళ్తే పంటలు పండక ఉద్యోగాలు రాక విదేశాలకు వెళ్తున్నారని బిఆర్ఎస్ పార్టీ పత్రిక ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. మల్లెల బాబు బిఆర్ఎస్ పార్టీ యూత్ సభ్యుడని పార్టీ నాయకులను రైతులుగా చిత్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. గత పది సంవత్సరాల నుండి అధికారంలో ఉండి మాజీ మంత్రి కేటీఆర్ మల్కపేట రిజర్వాయర్ 9వ ప్యాకేజీ కెనాల్ ను ఎందుకు పూర్తి చేయలేదని అన్నారు. తాత్కాలిక పద్ధతిన అప్పర్ మానేరు నింపుతూ కాలం వెళ్ళబుచ్చి ఇప్పుడు రైతులకు ఇబ్బంది వచ్చేసరికి ఆ తప్పును కాంగ్రెస్ పై నెట్టడం ఎంతవరకు సమంజసమని అన్నారు మీరు కట్టిన కాళేశ్వరం సుందిళ్ల అన్నారం ప్రాజెక్టులు నీటితో నింపితే కూలిపోయే ప్రమాదం ఉందని అధికారులు తేల్చడంతోనీటిని నింపలేదన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారాన్ని మానుకొని నిజానిజాలను ప్రజలకు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, డైరెక్టర్లు మిండేటి శ్రీనివాస్, సుడిద రాజేందర్, నారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, రవీందర్ నాయకులు, చెన్నిబాబు, నందికిషన్, మర్రి శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లారెడ్డి, గోంగూరి బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎండిన వరి పొలాలతో దిక్కుతోచని స్థితిలో రైతన్నలు

**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**



తంగళ్ళపల్లి మండలంలోని వేణుగోపాల్ పూర్ లో బిజీగ అంజయ్య,మేడిపల్లి ప్రభు,లింగంపల్లి శంకర్ ల పొలాలు పూర్తిస్థాయిలో నీరు అందక ఎండిపోవడంతో రైతులు ఏసంగి సీజన్ లో అన్నదాతలను కన్నీరు పెట్టిస్తుంది. వ్యవసాయ బావులు బోర్లు ఎత్తిపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయి. సాధారణం కంటే ఎక్కువ వర్షం కురవడంతో చెరువులు కుంటల్లో నీళ్లు ఉన్నాయి అన్న ఆశతో రైతులు ఎసంగి వరి సాగు చేశారు, అయితే పొట్టకొచ్చేదశలో నీరు అందక పూర్తిగా ఎండిపోవడంతో రైతన్నలు కన్నీరు పెట్టుకుంటున్నారు. తంగళ్ళపల్లి మండలంలో అత్యధిక లోతుగా భూగర్భ జలాలు పడిపోయాయి, మండలంలో పంటలు ఎండుతున్న పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడని వాపోతున్నారు.మండుతున్న ఎండలకు బోర్లు ఎత్తిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు మళ్లీ బోర్లు వేస్తూ అప్పుల పాలవుతున్నారు. ఈ ప్రభుత్వం అయినా కాలువలు తీసి నీటి ఎద్దడి లేకుండా చేయాలని కోరుతున్నారు.

# మాజీ సర్పంచ్ నందయ్యను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**బలగం టీవీ , బోయినిపల్లి**




రాజన్న సిరిసిల్ల బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బూరుగుల నందయ్యకు కుడికాలు (తొంటి) ఆపరేషన్ జరుగగా, విషయం తెలుసుకొన్న చొప్పదండి మాజీ శాసన సభ్యులు రవిశంకర్ పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి తెలుసుకొన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట గ్రామ శాఖ అధ్యక్షులు రాజారాం, మాజీ మండల కో-ఆప్షన్ మెంబర్ మహ్మద్ ఆజ్జూ, మాజీ సర్పంచ్ లు చిందం రమేష్, గుంటి శంకర్, ఆరెపల్లి రాజు, సోషల్ మీడియా కన్వీనర్ కమల్ గౌడ్, ఉపసర్పంచ్ మేడిద మల్లయ్య, గ్రామ ఉపాధ్యక్షులు నల్లల కమలాకర్ సెంచు ఎల్లారెడ్డి, మోకిడే హరీష్,,బుర్ర శ్రీనివాస్ గౌడ్, దూస రాజశేఖర్, రవి బూర్గుల మహేందర్ తదితరులు ఉన్నారు.

# రివేంజ్ తీర్చుకుని ఫైనల్‌కు...

## చాంపియన్స్ ట్రోఫీలో తుదిపోరుకు భారత్

- సెమీస్‌లో 4 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై టీమిండియా గెలుపు
- సెంచరీ మిస్ చేసుకున్న కోహ్లీ
- రాణించిన శ్రేయస్ అయ్యర్, అక్షర్, రాహుల్, పాండ్యా

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఫైనల్లోకి దూసుకెళ్లింది. దుబాయ్ లో జరిగిన సెమీఫైనల్ సమరంలో టీమిండియా 4 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై గెలుపొందింది. ఈ గెలుపుతో వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో ఎదురైన పరాభవానికి నేటి మ్యాచ్ తో ప్రతీకారం తీర్చుకున్నట్టయింది. సౌత్ ఆఫ్రికా, న్యూజిలాండ్ మధ్య నేడు జరిగే మరో సెమీ ఫైనల్ మ్యాచ్ విజేతతో టీం ఇండియా ఫైనల్‌లో తల పడనున్నది.

ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్(96 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 73), అలెక్స్ క్యారీ(57 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 61) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో మహమ్మద్ షమీ(3/48) మూడు వికెట్లు తీయగా.. వరుణ్ చక్రవర్తి(2/49), రవీంద్ర జడేజా(2/40) రెండేసి వికెట్లు పడగొట్టారు.





అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత్ 48.1 ఓవర్లలో 267 పరుగులు చేసి గెలుపొందింది. విరాట్ కోహ్లీ(98 బంతుల్లో 5 ఫోర్లతో 84) సెంచరీ చేజార్చుకోగా.. శ్రేయస్ అయ్యర్(62 బంతుల్లో 3 ఫోర్లతో 45), కేఎల్ రాహుల్(34 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 42), హార్దిక్ పాండ్యా(24 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 28) కీలక ఇన్నింగ్స్ ఆడారు.

విరాట్ కోహ్లీ.. ఈ మ్యాచ్‌లో కూడా 84 పరుగులతో టీం విజయంలో కీలక పాత్ర పోషించారు. 45 పరుగులకే ఓపెనర్లు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఔటయినా, శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్‌లతో మంచి భాగస్వామ్యాలు నెలకొల్పుతూ జట్టు విజయానికి బాటలు వేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్, ఆడం జంపా రెండేసి వికెట్ల చొప్పున, బెన్ డ్వార్షుయిస్, కూపర్ కొనొల్లీ చెరో వికెట్ తీశారు.

## ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యాయత్నం..!

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ సింగర్ కల్పన ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమె నిద్రమాత్రలు మింగినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమెను ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేటలోని వర్టెక్స్ ప్రివిల్లేజ్ అపార్ట్‌మెంట్‌లో కల్పన ప్రస్తుతం నివసిస్తున్నారు. అయితే రెండు రోజులుగా ఆమె ఇంటి డోర్ ఓపెన్ చేయకపోవడంతో అపార్ట్ మెంట్ వాసులు అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అపార్ట్ మెంట్‌కు చేరుకుని కల్పన ఉంటున్న ఇంటి తలుపులు పగలగొట్టి చూడగా ఆమె అపస్మారక స్థితిలో ఉంది. దాంతో కల్పనను నిజాంపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, కల్పన ఆత్మహత్యకు యత్నించడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

టాలీవుడ్‌లో అత్యంత పాపులర్ సింగర్ కల్పన ఒకరు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ చిత్రాల్లో అనేక పాటలు పాడారు. ఏఆర్ రెహమాన్, ఇళయరాజా, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, కేవీ మహాదేవన్‌తో కలిసి ఆమె ఎన్నో మధురమైన పాటలు పాడారు. సింగర్‌గానే కాకుండా డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా ఆమె మంచి గుర్తింపు తెచ్చుకుంది.


## కార్తికి ప్రమాదం

**బలగం టీవీ, హైదరాబాద్**



తమిళ నటుడు కార్తికి ప్రమాదం జరిగింది. ఆయన హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'సర్దార్ 2' 2022లో వచ్చిన స్పై, యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'సర్దార్'కి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కర్ణాటకలో శరవేగంగా జరుపుకుంటుంది. అయితే ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాలు తీస్తుండగా కార్తికి ప్రమాదం జరిగింది. దీంతో అతడి కాలికి గాయం కాగా.. వెంటనే స్పందించిన చిత్రబృందం అతడిని ఆస్పత్రికి తరలించింది. ప్రస్తుతం కార్తికి ఎలాంటి ఇబ్బంది లేదు కానీ వారంపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు సమాచారం. దీంతో షూటింగ్‌ను మధ్యలోనే ఆపేసినట్లు టాక్. అ

## 'రాబిన్‌హుడ్' చేశాక కాన్ఫిడెన్స్ పెరిగింది



- రాజేంద్రప్రసాద్

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు నితిన్ హైలీ యాంటిసిపేటెడ్ హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. శ్రీలీల కథానాయికగా నటించింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈనెల 28న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో రాజేంద్రప్రసాద్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.సినిమా ఇండిస్ట్రీకి వచ్చి 48 ఏళ్ళు అయ్యింది. 'రాబిన్‌హుడ్' చేశాక యాక్టర్‌గా నామీద నాకు కాన్ఫిడెన్స్ లెవల్ పెరిగింది. ఈ సినిమా చూసాక నేను హీరోగా చేసిన ఎంటర్‌టైనింగ్ సినిమాలు, ఆనాటి రోజులు ఆడియన్స్‌కి గుర్తుకు వస్తాయి. క్యారెక్టర్, పెర్ఫార్మెన్స్ పరంగా సినిమా చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. దర్శకుడు వెంకీ అద్భుతంగా రాశాడు, తీశాడు. ఈ సినిమా, క్యారెక్టర్ పట్ల చాలా హ్యాపీగా ఉన్నాను.

ఇందులో ఇండియాలోనే హయ్యస్ట్ సెక్యూరిటీ ఏజెన్సీ నాది. నా ఏజెన్సీలో పని చేయడానికి హీరో వస్తాడు. ఇంతకంటే కథ చెప్పకూడదు(నవ్వుతూ). నితిన్, నా కాంబినేషన్ చాలా అద్భుతంగా ఉంటుంది. ఇందులో నా టైమింగ్ నితిన్ ఫాలో అవ్వాలి, నితిన్ టైమింగ్‌ని నేను ఫాలో అవ్వాలి. క్యారెక్టర్స్ అలా డిజైన్ చేశారు. మేము ఇద్దరం వెన్నెల కిశోర్‌కి దొరక్కూడదు. సినిమా చూసినప్పుడు భలే గమ్మత్తుగా ఉంటుంది. ఇలాంటి ఎంటర్‌టైనింగ్ సినిమా చేసి చాలా కాలమైంది. 'జులాయి' తర్వాత 'సన్నాఫ్ సత్యమూర్తి, నాన్నకు ప్రేమతో, శ్రీమంతుడు, ఓ బేబీ, ఎఫ్2' చిత్రాల్లో నా పాత్రలని ఎలా అయితే గుర్తుపెట్టుకున్నారో.. రాబిన్‌హుడ్‌లో చేసిన క్యారెక్టర్ కూడా నేను గ్యారెంటీగా గుర్తుపెట్టుకునే క్యారెక్టర్ అవుతుంది.

## పాకిస్థాన్‌కు కొత్త కెప్టెన్

**బలగం టీవీ, హైదరాబాద్**



పాకిస్థాన్ టీ20 కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్‌కు ఆ దేశ క్రికెట్ బోర్డు గట్టి షాక్ ఇచ్చింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్ కోసం న్యూజిలాండ్‌కు వెళుతున్న పాకిస్థాన్ టీ20 జట్టుకు కెప్టెన్‌గా రిజ్వాన్‌ను తప్పించి సల్మాన్ అలీ అఘూకు పగ్గాలు అప్పగించింది. అయితే, మూడు వన్డేల సిరీస్‌కు మాత్రం రిజ్వానే కెప్టెన్సీ చేస్తాడని పీసీబీ వెల్లడించింది. మార్చి 16 నుంచి కివీస్‌తో పాక్ ఐదు టీ20లు, ఆ తర్వాత మూడు వన్డేలు ఆడనుంది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ కూడా ఉన్నందున ఇప్పటినుంచే చర్యలు తీసుకుంటోంది.

## కింగ్‌స్టన్ కొత్త ప్రపంచంలోకి తీసుకువెళ్తుంది




**బలగం టీవీ, హైదరాబాద్**

సంగీత దర్శకుడు జీవి ప్రకాష్ కుమార్ హీరోగా నటించిన తాజా సినిమా 'కింగ్స్టన్'. జి స్టూడియోస్ సంస్థతో కలిసి ప్యారలల్ యూనివర్స్ పిక్చర్స్ పతాకం మీద ఆయన ప్రొడ్యూస్ చేశారు. నిర్మాతగా జీవి ప్రకాష్ కుమార్ తొలి చిత్రమిది. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత మహేశ్వర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ శుక్రవారం మార్చి 7వ తేదీన విడుదల కానుంది. ఈ సందర్భంగా జీవి ప్రకాష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ "ఈ సినిమాలో సముద్ర తీరం పక్కన ఒక ఊరు ఉంటుంది. ఆ ఊరిలో జాలరి పాత్ర చేశాను. సాధారణంగా జాలర్లు అందరూ సముద్రంలో వేటాడడానికి వెళతారు.అయితే ఆ ఊరి ప్రజలు ఎవరూ సముద్రంలోకి వెళ్లరు. ఆ ఊరికి ఒక శాపం ఉంటుంది. అది ఏమిటి? అనేది సినిమాలో చూడాలి. శాపాన్ని ఎదిరించాలని హీరో సముద్రంలోకి వెళ్తాడు. అక్కడ ఏం జరిగిందనేది సినిమా. ఇండియాలో ఫస్ట్ సీ అడ్వెంచర్స్ థ్రిల్లర్ సినిమా ఇది. సముద్రంలోకి వెళ్ళిన తర్వాత హీరోకు జాంబీలు ఎదురవుతారు. అలాగే ఆత్మలు కూడా ఉంటాయి. ప్రేక్షకులకు ఈ సినిమా విభిన్నమైన అనుభూతినిస్తుంది. ఇండియాలో ఇప్పటివరకు ఇటువంటి సినిమా రాలేదు. 'బాహుబలి' ప్రేక్షకులను ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకువెళ్లింది. అలాగే 'కాంతార' సినిమా ప్రేక్షకులను స్పిరిచువల్ వరల్డ్‌లోకి తీసుకు వెళ్లింది. మా 'కింగ్స్టన్' సినిమా కూడా ప్రేక్షకులను ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకు వెళ్తుంది"అని తెలిపారు.

## 'నారి' ఒక్క టికెట్ కొంటే మరో టికెట్ ఉచితం

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆమని, వికాస్ వశిష్ఠ, మౌనిక రెడ్డి, ప్రగతి, సునయన, కేదార్ శంకర్, ప్రమోదినీ తదితరులు కీలక పాత్రల్లో నటించిన సినిమా 'నారి'. మహిళల్ని గౌరవించాలి, ఆడపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి, ఇప్పుడున్న సామాజిక పరిస్థితుల్లో 13-20 ఏళ్ల పిల్లలు ప్రమాదంలో ఉన్నారనే విషయాన్ని చెబుతూ దర్శకుడు సూర్య వంటిపల్లి ఈ చిత్రాన్ని రూపొందించారు. శ్రీమతి శశి వంటిపల్లి నిర్మించారు. ఈ సినిమా మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 7న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఓ బంపర్ ఆఫర్ అనౌన్స్ చేశారు. ఈ నెల 7, 8 తేదీల్లో ఈ సినిమా చూసే కపుల్స్ కోసం టికెట్స్ పై వన్ ప్లస్ వన్ ఆఫర్ ప్రకటించారు. 7, 8వ తేదీల్లోని అన్ని షోస్‌కు ఈ ఆఫర్ వర్తించనుంది. అందరూ తమ టికెట్స్ సమీపంలోని థియేటర్లలో, బుక్ మై షో ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు అని మేకర్స్ తెలిపారు. 'ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన కంటెంట్, పాటలు సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. సింగర్ సునీత పాడిన 'హవాయి హవాయి హవాయి', రమణ గోగుల పాడిన 'గుండెలోన ఏదో గట్టి సప్పుడైనదే' పాట మిలియన్స్ వ్యూస్ సాధిస్తూ సూపర్ హిట్ అయ్యాయి. ఈ సినిమా అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని నిర్మాత శశి వంటిపల్లి అన్నారు.

## ఓటిటిలోనూ "సంక్రాంతికి వస్తున్నాం" రికార్డు

**బలగం టీవీ, హైదరాబాద్**




వెంకటేష్ హీరోగా ఐశ్వర్య రాజేష్ అలాగే మీనాక్షి చౌదరి హీరోయిన్స్ గా దర్శకుడు అనీల్ రావిపూడి తెరకెక్కించిన సెన్సేషనల్ హిట్ చిత్రం "సంక్రాంతికి వస్తున్నాం".ఈ చిత్రం తాజాగా ఓటిటిలోకి రావడం కూడా జరిగింది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు జీ5 వారు సొంతం చేసుకోగా అందులో పాన్ ఇండియా ఎంట్రీ ఈ చిత్రం ఇచ్చింది. ఇక అక్కడ రావడంతోనే ఓటిటిలో కూడా ఆల్ టైం రికార్డు వ్యూస్ ని అందుకోగా ఇపుడు మరో హిస్టరీ సెట్ చేసినట్టుగా మేకర్స్ చెబుతున్నారు. ఇలా సంక్రాంతికి వస్తున్నాం చిత్రం 48 గంటల్లో ఏకంగా 200 మిలియన్ కి పైగా స్ట్రీమింగ్ మినిట్స్ ని నమోదు చేసినట్టుగా చెబుతున్నారు. దీనితో ఓటిటిలో కూడా కొత్త రికార్డ్స్ తో ఈ సినిమా అదరగొడుతుంది అని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందించగా దిల్ రాజు, శిరీష్ లు నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే.